క్లుప్తంగా

కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే పద్మావతికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించబోయే శ్రీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని నిర్వాహకులు కోరారు. ఈమేరకు సోమవారం కోదాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు పూజా కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జేపీఆర్ ఫౌండేషన్ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న జేపీఆర్ ఫౌండేషన్ కోశాధికారి అరవింద్‌రెడ్డి

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఇటీవల మృతి చెందిన అప్పికట్ల సరిత కుటుంబానికి జోగు పిచ్చిరెడ్డి (జేపీఆర్) ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్‌రెడ్డి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా పానుగోడు గ్రామ జోగు అరవింద్‌రెడ్డి యువ సైన్యం ఆధ్వర్యంలో రూ. 5వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మలికంటి కార్తీక్, ఉపేందర్, ఫకీరా, నందిపాటి సైదులు, నేలపట్ల రవి, అశోక్, మెడిసినమెట్ల రాంబాబు, రఫీ, పృథ్వీ, మనోహర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు పీఏసీఎస్ చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దొండపాడులో గల పీఏసీఎస్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.వెంకటరెడ్డి, ఎం.కొండారెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, నాగగోపి, లక్ష్మీనరసింహారెడ్డి, రామారావు, నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై యాదవేందర్‌రెడ్డి

మోతె : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మోతె ఎస్సై యాదవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై పోలీస్ కళా బృందం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. ప్రజలు సైబర్ మోసాలకు గురి కావద్దన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డుల వివరాలను ఇతరులకు తెలపవద్దన్నారు. మెస్సేజీల్లో వచ్చే బ్లూ లింక్‌ను అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని, వేదింపులపై 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ఎస్ఓ శ్రీదేవి, పోలీస్ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్స్, కళా బృందం పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కార్యాలయంలో సోమవారం హుజూర్‌నగర్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోలా నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా పిల్లలమర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ జానీపాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బసవోజు శ్రీనివాసచారి, వైస్ ప్రెసిడెంట్‌గా కీతా రామనాథం, కోశాధికారిగా దేవరం రాంరెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా ఇందిరాల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఇట్టిమల్ల రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా దేవరం వెంకటరెడ్డి, షేక్ నాగుల్ మీరా, కోమరాజు అంజయ్య, గౌరవ సలహాదారులుగా దేసుమకొండ శేషంరాజు, సలహాదారులుగా నరేందర్, ఆర్పీ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో ఓసీలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలి

మునగాల : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ఓసీలకు ప్రత్యేక స్థానాలు కేటాయించి ఆయా స్థానాల్లో మాత్రమే వారు పోటీ చేసేలా చట్టం తేవాలని మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్స్ వేదికగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన కులగణన ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని, రాష్ట్రంలో ఓసీలు 16 శాతం ఉన్నట్లు కుల గణనలో తేలిందని, ఇతరులకు కేటాయిస్తున్న మాదిరిగానే ఓసీలకు కూడా 16 శాతం రిజర్వేషన్లను కేటాయించాని కోరారు. అప్పుడే అందరికీ సమాన న్యాయం జరుగుతుందన్నారు.

క్రమబద్ధీకరణపై కార్మికుల ఆశలు

- మల్టీపర్పస్ వర్కర్లుగా విధులు
- ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ
- చాలీచాలని వేతనాలు.. నెలనెల అందకపోవడంతో ఇబ్బందులు
- ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకోని పాలకులు



పెదవీడులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

మఠంపల్లి : పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. అనేక ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నామని, ప్రభుత్వాలు మారుతున్నా తమను రెగ్యులరైజ్ చేయడంపై దృష్టి పెట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గల ఏడు మండలాల పరిధిలో సుమారు 140 గ్రామ పంచాయతీలు ఉండగా 683 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు పారిశుద్ధ్య పనులతో పాటు బిల్ కలెక్టర్, కారోబార్, అటెండర్, ఎలక్ట్రీషియన్, పంపు ఆపరేటర్, వాచ్‌మెన్, ట్రాక్టర్ డ్రైవర్లు (మల్టీపర్పస్ వర్కర్లు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. కేవలం నెలకు రూ.9,500 వేతనంతో పనిచేస్తున్నారు. గడచిన 30 ఏళ్లుగా పనిచేస్తున్నా తమను పర్మినెంట్ చేయకపోవడంతో పంచాయతీ కార్మికులు పలు దఫాలుగా రిలే నిరాహార దీక్షలు చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయని వారు అంటున్నారు.

పెండింగ్‌లో వేతనాలు..

కాగా, పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ఉదయం 6 గంటలకే విధుల్లో చేరి వీధిదీపాలు ఆర్పివేయడం, సాయంత్రం వెలిగించడం, మంచినీటి సరఫరా, మురికి కాలువలు శుభ్రం చేయడం, ట్రాక్టర్‌తో చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, ఇంటి పన్నులు వసూలు చేయడం తదితర అన్ని రకాల పనులు చేస్తున్నారు. అయినా ఇచ్చే కొద్ది పాటి వేతనాలను కూడా ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్‌లో పెడుతుండడంతో ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలతో పూటగడవని పరిస్థితి నెలకొందని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించామని, అందుకు తమకు శాలువాలతో సన్మానించారని, కడుపు మాత్రం మాడ్చుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనికరించి తమను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం అందించాలని పంచాయతీ కార్మికులు వేడుకుంటున్నారు.

హామీలు ఇస్తున్నారు.. మోసం చేస్తున్నారు



తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు చేస్తున్నాం. కానీ పాలకులు, అధికారులు మాత్రం తమ సర్వీసులను క్రమబద్ధీకరించి న్యాయం చేస్తామంటూ హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తున్నారు.

– ఇంటి రవి, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకుడు, మఠంపల్లి

వెట్టిచాకిరీ చేస్తున్నాం.. న్యాయం చేయాలి



ఏళ్లతరబడి చాలీచాలని వేతనంతో వెట్టిచాకిరి చేస్తున్నాం. కరోనాకు లోకమంతా భయపడిన సమయంలో సైతం ఎంతో శ్రమ చేశాం. మాకు శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. కానీ మా కడుపులు మాత్రం మాడ్చుతున్నారు. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

– పోతబత్తిని సుశీల, పారిశుద్ధ్య కార్మికురాలు, పెదవీడు

పర్మినెంట్ చేయకపోతే సహాయ నిరాకరణ తప్పదు



ప్రభుత్వం తమ సర్వీసులను ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరించాలి. మాకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలి. మమ్మల్ని పర్మినెంట్ చేయకపోతే గ్రామాల్లో పనులు చేపట్టకుండా సహాయ నిరాకరణ చేయడం తప్పదు.

– సైదానాయక్, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు, కృష్ణాతండా

అరుణోదయ విలీన సభను జయప్రదం చేద్దాం



కోదాడలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు



మోతె : కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 5న తేదీన నిర్వహించబోయే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కమిటీల విలీన సభను విజయవంతం చేద్దామని ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపుడి చిన్ని అన్నారు. సోమవారం కోదా పట్టణ పరిధిలోని లాల్‌బంగ్లా ఎదుట సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చీలిన అరుణోదయ సమాఖ్య ఈ సభ ద్వారా ఒక్కటి అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, పోకల మైసయ్య, విజయ్, వీరబాబు, సురేష్, నగేష్, రవితేజ, సైదులు, ఖాసీం, గోపి ఉన్నారు.

రావిపహాడ్‌లో కరపత్రం ఆవిష్కరణ

మోతె : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 5న జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కమిటీ విలీన సభను విజయవంతం చేయాలని నాయకుడు పొడపంగి ముత్తయ్య కోరారు. సోమవారం మోతె మండలంలోని రావిపహాడ్ గ్రామంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రామ శాఖ కార్యదర్శి మోత్కూరి వీరాచారి, ఎర్రబోయిన వెంకన్న, కొత్తపల్లి ఉప్పలయ్య, కుంచం వెంకన్న, కొడిదల యల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలో వాసవీ క్లబ్ ముందంజ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కోదాడ : సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సేకు శ్రీనివాసరావు, పత్తి నరేందర్ తెలిపారు. రథ సప్తమిని పురస్కరించుకొని సోమవారం కోదాడలోని వాసవీ భవన్ వద్ద నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం బ్రహ్మంగారి ఆలయం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారికి పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంపటి ప్రసాద్, పబ్బా గీతాదేవి, పొలిశెట్టి నవీన్, చల్లా లక్ష్మీనర్సయ్య, బెలిదె భరత్, నాగరాజు, కందూరు మాధవి, శంకర్రావు, గుడుగుంట్లసాయి, రంగా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరేడుచర్ల : పట్టణంలోని శివాజీనగర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ఇంజమూరి పున్నయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇంజమూరి శ్రీకాంత్, కార్యదర్శులుగా నందిపాటి మట్టయ్య, ఇంజమూరి శంకర్, ఇంజమూరి ఎలయ్య, ఉపాధ్యక్షుడిగా ఆమరవరపు వెంకన్న, అధికార ప్రతినిధిగా బాపట్ల నవీన్, కార్యవర్గ సభ్యులుగా ఇంజమూరి సురేష్, పలువురిని ఎన్నుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుకల వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర నేతలు ఇంజమూరి మల్లయ్య, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడవెల్లి చంద్రయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ శ్రీను, ఇంజమూరి రాజేష్, ఇంజమూరి సైదులు, నర్సింహ, గణేష్, రామకృష్ణ, సాయి తదితరులు ఉన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గరిడేపల్లి : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం మండలంలోని వెలిదండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీపీఐ, సీపీఎం నాయకులు ప్రధానమంత్రి మోదీ, ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

హుజూర్‌నగర్ : వసంత పంచమి సందర్భంగా పట్టణానికి చెందిన సీహెచ్.నరసింహారావు భార్య సరిత సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో పలువురు పేద పిల్లలకు పలకలు, బలపాలు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ కార్యవర్గ సభ్యులు కె.పాపారావు, వీ.వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీ, టి.ప్రవళిక, లీల, సతీష్, ప్రవీణ్, హరీష్, మురళి, దయాకర్, రామ్ నరేష్, స్వామి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం మాట నిలబెట్టుకోవాలి



కోదాడరూరల్ : సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మఠంపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ, చింతా వినయ్‌బాబు మాదిగ కోరారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించబోయే లక్ష డప్పులు.. వేలగొంతుల సభ పోస్టర్‌ను సోమవారం కోదాడ పట్టణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, నాయకులు యలమర్తి రాము, గంధం పాండు, చీమ శ్రీనివాసరావు, కర్ల కాంతారావు, పడిశాల రఘు, బంగా వెంకటరత్నం, సత్యరాజు ఉన్నారు.

సభ పోస్టర్ ఆవిష్కరణ

మఠంపల్లి : హైదరాబాద్‌లో ఈనెల 7న జరగనున్న లక్ష డప్పులు. . వేలగొంతుల మహాప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు ప్రభుమాదిగ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్, ఎంజేఎఫ్, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : లక్ష డప్పులు.. వేల గొంతులు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద భిక్షం, మండల అధ్యక్షుడు పిట్ట పిచ్చయ్య, జిల్లా నాయకులు ఎడవెల్లి బాటసారి, కడప దేవదానం, మాచర్ల రవి, వేణు, రవి, అశోక్, నరసింహ, సిద్ధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

నడిగూడెం : వేల గొంతులు– లక్ష డప్పులు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు పిలుపునిచ్చారు. సోమవారం నడిగూడెంలో వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణపుల మోష, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు దున్నా సుధాకర్, పాతకొట్ల శ్రీనివాస్, దున్నా వెంకటేశ్వర్లు, నాగార్జున్, క్రాంతి కుమార్, వంశీ, శ్యామ్, ప్రవీణ్, ప్రమోద్, నాగరాజు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

మునగాల : హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలు మహాసభ పోస్టర్‌ను మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, లంజేపల్లి శ్రీను మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాతకొట్ల నాగరాజు మాదిగ, కొత్తపల్లి అంజయ్య మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుమేరకు వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నాయకులు మిట్టగణపుల జగన్నాథం, మొలుగూరి వెంకటేశ్వర్లు, గద్దల అశోక్, పడిశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో..

డప్పులతో తరలిరావాలి

మోతె : హైదరాబాద్‌లో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ సారథ్యంలో జరిగే వేల గొంతుకలు.. లక్ష డప్పులు సభను విజయవంతం చేయాలని అప్పన్నగూడెం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ నాయకులు సంద్ర మధు, సంద్ర కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మాదిగ కార్యకర్త డప్పులతో హైదరాబాద్‌కు తరలిరావాలన్నారు.

హుజూర్‌నగర్ : లక్ష డప్పులు, వేల గొంతుకలు (చలో హైదరాబాద్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని హరిజనవాడలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్.నాగయ్య, కిరణ్‌కుమార్, కె.శ్రవణ్ కుమార్, ఎం.శరత్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.నాగరాజు, పి.క్రాంతి, ఎం.లక్ష్మయ్య, రవీందర్, చిరంజీవి, వెంకన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్‌కు దూరం

- సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీలు శ్యాంకుమార్, ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీలు జిట్టా శ్యాంకుమార్, మారుతి ప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక న్యాయస్థానంలో న్యాయవిజ్ఞానం, క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మహిళల్లో అధిక శాతం రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో గొంతు క్యాన్సర్‌కు గురవుతున్నారని చెప్పారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వేణుగోపాల్, యశ్వంత్. కక్షిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ రేణుకాదేవి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, రవి కుమార్, కె.బాలకృష్ణ, ఎంఎస్ రాఘవరావు, నాగేష్ రాథోడ్, సైదా హుస్సేన్, కె.సైదులు, కె.సురేష్, వీరు, నరేష్, సంధ్య, రమేష్, రమణారెడ్డి, రామలక్ష్మారెడ్డి, నరసింహారావు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టులో వరిపైరుకు అగ్గితెగులు



ఆకుపాములలో వరిపైరులో అగ్గితెగులును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త నరేష్

మునగాల : ఆయకట్టులో సాగు చేసిన వరికి అగ్గితెగులు సోకినట్లు కోదాడ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు డి.ఎల్లయ్య, గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నరేష్, ఏఓ బుంగా రాజు తెలిపారు. మండలంలోని ఆకుపాములలో రైతు కందగట్ల సాంబయ్య శ్రీ–101 విత్తనాలతో సాగు చేసిన వరిపైరును సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పైరులో ఇప్పుడిప్పుడే కొద్దిగా కంకులు వస్తున్నాయని, నవంబర్ 15 లోపు నాట్లు వేయడంతో వాతావరణంలో మార్పుల వల్ల ఇలా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మూడో దఫా ఎకారకు ఒక బస్తా చొప్పున యూరియాతో పాటు ఎకరానికి 25కిలోల పోటాష్ వేసుకోవాలని సూచించారు. అగ్గి తెగులు నివారించకపోతే మెడవిరుపుగా మారి పూర్తికంకి విరిగిపోయి పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లే అవకాశముందని తెలిపారు. తెగులు నివారణకు మందులు స్ప్రే చేసి పైరును రక్షించుకోవాలన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా



దారమళ్ల మధు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, తదితరులు

మోతె : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మోతె మండలంలోని నేరడవాయి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దారమళ్ల వెంకన్న (కండక్టర్) కుమారుడు మధు దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మధు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, ఏలూరి వెంకటేశ్వరరావు, మండల నాయకులు నూకల శ్రీనివాస రెడ్డి, కండక్టర్ వెంకన్న, మిక్కిలినేని సతీష్, మండల యూత్ అధ్యక్షుడు పాష, నాయకులు హనుమాచారి, నరేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



చిలుకూరు : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్ కవిత

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీజ్ఞానసరస్వతి దేవాలయంలో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామివారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాముహిక అక్షరాభ్యాసాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ పాలక వర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

హుజూర్‌నగర్ : వసంత పంచమిని పురస్కరించుకొని హుజూర్‌నగర్‌లోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు దాకారపు యక్షిత, పగడాల కూనాల్‌కు టీచర్ ఆకుల రజని ఓనమాలు దిద్దించారు. అన్నపూర్ణ, లక్ష్మీ, ప్రమీల, అంజమ్మ, సత్యవతి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : వసంత పంచమిని పురస్కరించుకొని నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్, సిరిపురం అంగన్‌వాడీ కేంద్రం– 1 లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆయా కార్యక్రమాల్లో సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, అంగన్‌వాడీ టీచర్ నేలమర్రి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం చిలుకూరు అంగన్‌వాడీ కేంద్రం– 4లో చిన్నారులకు అక్షరాభాస్యం నిర్వహించారు. టీచర్ సిరికొండ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



హుజూర్‌నగర్ : చిన్నారులకు ఓనమాలు దిద్దిస్తున్న టీచర్ ఆకుల రజని

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, తెలంగాణకు చెందిన పార్లమెంటు సభ్యుల వైఫల్యంతోనే బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మొండి చేయి చూపిందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు అవిరెండ్ల నాగేంద్రబాబు ఆరోపించారు. సోమవారం గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే లేకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు కేంద్రంతో కొట్లాడకపోవడం సిగ్గు చేటని విమర్శించారు.

నేడు పశువైద్య శిబిరం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో మంగళవారం మహా సిమెంట్స్ పరిశ్రమ సహకారంతో పశు సంవర్ధక శాఖ సూర్యాపేట వారిచే పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహా సిమెంట్స్ ప రిశ్రమ ప్లాంట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో పశు గర్భకోశ వ్యాధులకు చికిత్స, గొర్రెలు, మేకలకు చికిత్స, పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు ఆసక్తి గల రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'పంటలపై అడవి పందుల బెడద –పంటల సంరక్షణ పద్ధతులు'అనే అంశంపై శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలు తెలియజేస్తారని ఆయన తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచురించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం స్థానికంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భైక్యా మంజీనాయక్, హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, నాయకులు చిట్యాల అమర్‌నాథ్ రెడ్డి, ఈశ్వర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చిత్రాలతో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తన్నీరు మల్లికార్జున్, మంజునాయక్, అమర్‌నాథ్ రెడ్డి, యోహాన్, ఉపేందర్, ముస్తఫా, క్రాంతి, రాము, అనీఫ్ పాల్గొన్నారు.

రూ. 2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ మంజూరు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన రైతు కొడారు రాధ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి.. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతికి బాధిత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ మపార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.